ఆశీర్వదించండి.. అండగా ఉంటాం




మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, చిత్రంలో ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీదమస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, జనాలతో కిక్కిరిసిన ఇస్కపల్లి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి
- అల్లూరు మండలం ఇస్కపల్లిలో ఎన్నికల ప్రచారం
- జన సముద్రాన్ని తలపించిన ఇస్కపల్లి

అల్లూరు : రానున్న రోజుల్లో అల్లూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు మీ అందరూ మమ్మల్ని ఆశీర్వదించండి.. మీకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు స్వగ్రామం ఇస్కపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సంద్రాన్ని తలపించే రీతిలో జనం హాజరై అడుగడుగన హారతులు, బాణసంచా, డీజే, తీన్మార్ డ్యాన్సులు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. అద్యంతం కోలాహలంగా సాగిన ప్రచారంలో ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తనకు మంచి మిత్రుడని, తన గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో కూడా తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. అటువంటి వారిద్దరు వైఎస్సార్ సీపీలో ఉండడం ఎంతో శుభపరిణామమన్నారు. వారి ఇద్దరి సహకారంతో రానున్న ఎన్నికల్లో తనకు, ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీ రావడం తథ్యమన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యపడుతుందన్నారు. అల్లూరు మండలంలోని ఇస్కపల్లి రామాలయానికి టీటీడీ నుంచి రూ.1.30 కోట్ల మంజూరైన నిధులు రద్దయినట్లు స్థానికులు చెప్పడంతో టీటీడీ చైర్మన్‌తో మాట్లాడి రావాల్సి నిధులను విడుదల చేయించే బాధ్యత తాను తీసుకుంటునన్నారు. రాజుపాళెం నుంచి ఇస్కపల్లికి వేస్తున్న రోడ్డు పెండింగ్ నిధులను విడుదల చేయించి పూర్తి చేస్తే బాధ్యత కూడా తీసుకుంటానన్నారు. అల్లూరు మండలాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తే బాధ్యత ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు తాను కూడా తీసుకుంటానని తెలియజేశారు. రాజ్య సభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ తనకు రాజ్యసభ పదవి వచ్చేందుకు ముఖ్య కారకుడు తన మిత్రుడు విజయసాయి రెడ్డి అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి తర్వాత రెండో స్థానంలో ఉండే వ్యక్తి మనకు ఎంపీ అభ్యర్థిగా రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు తన వంతు కృషి చేస్తానని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి అన్న రావడం మన అదృష్టంగా భావించాలన్నారు. చంద్రబాబు కులాల మధ్య చిచ్చుపెట్టి ఓటు బ్యాంకుగా మార్చుకుంటే సీఎం జగనన్న వచ్చిన తర్వాత వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్తకు తమ తమ పరిధిలో 500 ఓట్లు వేయించే సామర్థ్యం ఉందని, ఎన్నికలు సమీపిస్తున్నాయి కాబట్టి అందరం కష్టపడి పనిచేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ నేత కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కందుకూరు అసెంబ్లీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయి కుమార్, బీద రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో హార్బర్ వెలుగులు

- జగనన్న చిత్తశుద్ధిని, చేసిన మంచిని గుర్తించండి
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఘనంగా స్వాగతిస్తున్న మత్స్యకారులు

కావలి: సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల అభ్యున్నతితో వారి జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మించారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజాసంకల్పయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. మత్స్యకారులకు వృత్తి పరంగా అందించే సంక్షేమ పథకాలే కాకుండా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలతో ఎంతో మేలు చేకూర్చారన్నారు. మత్స్యకారులకు టీడీపీ హయాంలో మేలు జరిగిందా? వైఎస్సార్‌సీపీ హయాంలో మేలు జరిగిందా గుర్తించాలని కోరారు. కావలి మండలంలో తీరప్రాంత గ్రామాలైన తుమ్మలపెంట పంచాయతీ తుమ్మలపెంట నుంచి కొత్తసత్రం వరకు మత్స్యకార గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే విస్తృతంగా ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుమ్మలపెంట పంచాయతీని ఆనుకుని ఫిషింగ్ హార్బర్ నిర్మించారని, అక్కడ 1250 బోట్లు లంగర్ వేయడానికి వసతి ఉంటుందన్నారు. ఆ బోట్లను కావలి నియోజకవర్గంలోని మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా అందించాలని జగనన్నను కోరడంతో అంగీకరించారన్నారు. ఒక్కో బోటుకు 10 మంది చొప్పున ఉంటారని , దీని ఖరీదు రూ.1.2 కోట్లు అయితే అందులో కేవలం 10 శాతం రూ.12 లక్షలు మత్స్యకారులు చెల్లించాల్సి ఉందన్నారు. మిగిలినది ప్రభుత్వ వాటా, బ్యాంక్ ద్వారా సమకూరుతోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మత్స్యకార గ్రామాలకు ఈ బోట్లు సమకూర్చి, మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వసలలు పోకుండా శాశ్వతంగా నివారించాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. ఫిషింగ్ హార్బర్ వల్ల మత్స్యకారులకు సంపాదనతో కూడిన ఉపాధి, ఈ ప్రాంత ప్రజలకు ఇతర ఉపాధి అవకాశాలు కలుగుతోందన్నారు. ఎన్నికలు అయిపోగానే జగనన్న కావలికి వచ్చి హార్బర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద కావలి నియోజకవర్గంలోని 6,700 మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ కాలంలో రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రే బటన్ నొక్కి నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ఏలుబడిలో రూ.4,000 ఇస్తామని చెప్పి ఎగ్గొట్టే వాడని విర్శించారు. డీజిల్ సబ్సిడీని లీటరుకు రూ.9 ఇస్తుండడం, స్మార్ట్ కార్డుల ద్వారా అప్పటికప్పుడే డీజల్ కొనుగోలులో లబ్ధిపొందుతున్నారన్నారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు సముద్రంలో ప్రమాదవశాతు మరణిస్తే ఆ కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులంటే చంద్రబాబుకు చిన్న చూపు అన్నారు. జగనన్న గొప్ప మనసుతో ఎలాంటి తారతమ్యాలు చూపకుండా మత్స్యకారుల అభ్యున్నతికి సహకారం అందిస్తున్నారని, మీ అభివృద్ధికి ఎవరు కృషి చేశారో గుర్తించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. రానున్న ఎన్నికల్లో తాత్కాలిక ప్రలోభాలకు గురి చేసే నేతకు బుద్ధి చెప్పాలని, మీ జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నను ఆదరించాలని కోరారు. మత్స్యకారులంతా మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కావలి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి జై కొట్టిన 400 కుటుంబాలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఆదిలక్ష్మి

కావలి: పట్టణంలోని 11 వార్డుతో వివిధ ప్రాంతాలకు చెందిన 400 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఐ-టీడీపీ కావలి నియోజకవర్గ మాజీ కన్వీనర్ మైనంపాటి జగదీష్, టీడీపీ మహిళా నాయకురాలు మంజుల వాణి, టీడీపీ ఎస్టీ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు వియ్యాల నరేంద్ర ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 400 కుటుంబాలు స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. వారికి ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు వేముల చెన్నకేశవులునాయుడు, అన్నపూర్ణ శ్రీను, ద్రోణాదుల వెంకట్రావు, చేవూరు కిరణ్, షేక్ షాహుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీటీసీ, జేసీఎస్ కన్వీనర్, తదితరులు

ఆత్మకూరురూరల్: మండలంలోని బండారుపల్లిలో టీడీపీకి చెందిన కోనంకి వెంకటప్పనాయుడు, కోనంకి వెంకటేశ్వర్లు, ఇప్పగుంటి హరిబాబు, చిన్నం పెంచలనాయుడు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్న లక్ష్మీ, జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ వాసిపల్లి లక్ష్మీరెడ్డి, సర్పంచ్‌లు సతీష్‌నాయుడు, బొలిగర్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు కోనేపల్లి సుబ్బారెడ్డి, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, రమేష్ నాయుడు, తోడేటి భాగ్యమ్మ, గడ్డం శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు టీడీపీ వాళ్లే!



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గతంలో ఆ పార్టీలో ఉండి స్వలాభం కోసం ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరారు. వారే ఇప్పుడు టీడీపీ కండువాలు కప్పించుకుంటున్నారు. ఆత్మకూరులో టీడీపీ అభ్యర్థి ఆనం సమక్షంలో శనివారం పలువురు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. అయితే వారంతా టీడీపీ వాళ్లేనని, తిరిగి కొత్తగా టీడీపీలో చేరినట్లుగా ప్రకటించుకోవడాన్ని ఇదేం చోద్యమంటూ రాజకీయ పరిశీలకు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు టీడీపీ విస్తృత స్థాయి సమావేశానికి రాకపోవడం గమనార్హం. ఆయనతో పాటు ఆయన వర్గీయులు అధిక శాతం హాజరుకాలేదు. ఏదో మొక్కుబడిగా కన్నబాబు వర్గీయులు కొంత మంది పాల్గొన్నారు. ఏఎస్‌పేట మండలానికి చెందిన పలువురు టీడీపీలో చేరడాన్ని అసలైన స్థానిక టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ఆనం ఆత్మీయ సమావేశానికి జనాన్ని కూలిచ్చి తరలించారనే ప్రచారం జరుగుతోంది.

బ్రహ్మోత్సవాలకు వైభవంగా ధ్వజారోహణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో కొలువైన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఘనంగా ధ్వజారోహణ నిర్వహించారు. ఉభయదాతలు సోమిశెట్టి వెంకటశేషారావు-అరుణ దంపతులు వేదమంత్రాల మధ్య యజ్ఞ క్రతువు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారిని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వేదపండితులు, ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఎన్నికల ప్రచారంలో రేషన్ డీలర్లు

వరికుంటపాడు: మండలంలోని విరువూరు రేషన్ షాపుల డీలర్లు మాలెం అరుణమ్మ, మాలెం ప్రభావతి ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో పార్టీ కండువా ధరించి ప్రచారం చేస్తున్న ఫొటోలు శనివారం సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ అయ్యాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల గురువారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ డీలర్లుగా పని చేస్తూ పార్టీ కండువా వేసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించడమేనని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రచారంలో పాల్గొన్న డీలర్లపై సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వలంటీర్లు రాజీనామా

సీతారామపురం: సీతారామపురం బిట్-2 సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఆ పత్రాలను పంచాయతీ కార్యదర్శి జీవన్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్షాల స్వార్థానికి, వేధింపులు తాళలేక తాము రాజీనామా చేస్తున్నామని, ప్రజలకు మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునేందుకు క్షేత్ర స్థాయిలో పని చేస్తామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయం కోసం శ్రమిస్తామన్నారు.

- బీఎస్పీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

ఉదయగిరి: బహుజన సమాజ్ పార్టీ తరఫున ఉదయగిరి అభ్యర్థిగా కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళెం గ్రామానికి చెందిన క్రాకుటూరు పుష్పాంజలి శనివారం తన నామినేషన్ దాఖలు చేశారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి



చామదలలో ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

జలదంకి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాగేందుకు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి మండలంలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. చామదల, వేణుగోపాలపురం, ఆదిరెడ్డిపాళెం, జలదంకి పంచాయతీలోని నెహ్రూనగర్, అప్పారావుతోట, టింకంవారిపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాడన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గతంలో 600 హామీలతో అధికారంలోకి వచ్చి ఆ తర్వాత మేనిఫెస్టోనే మాయం చేసిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వానికి పేదల సంపూర్ణ మద్దతు ఉందని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వారే స్టార్ క్యాంపెనర్లుగా నిలిచి అఖండ విజయాన్ని అందిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ నెల 24 న తన నామినేషన్ కార్యక్రమం ఉంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మాటలను నమ్మి మోసపోవద్దని, ఆయన పాలనకు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఎంత తేడా ఉందో ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ జన్మభూమి కమిటీలు పెట్టి ఆ పార్టీ నాయకులకే పథకాలు అందించారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకు అందరూ మళ్లీ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంటేరు రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, సర్పంచ్ పి. సీతారావమ్మ, ఎంపీటీసీలు దేవరపల్లి విజయ్‌రెడ్డి, పసుపులేటి అమరావతి, నాయకులు వంటేరు పెద లక్ష్మీనరసారెడ్డి, వంటేరు హజరత్‌రెడ్డి, పసుపులేటి ప్రసాద్, రావి ప్రసాద్ నాయుడు, గుర్రం జగ్గయ్య, ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి, సురె వెంకట శేషారెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, తమ్మినేని సతీష్‌నాయుడు, బోడిమండ్ల కృష్ణారెడ్డి, గందు వెంకారెడ్డి, వాకా మాధవరెడ్డి, గుమ్మడి రమేష్, కాకాని మహదేవ, దేవరపల్లి రఘురామిరెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: అభివృద్ధి, సంక్షేమం అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని, సంక్షేమాభివృద్ధి కొనసాగేందుకు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశర్వదించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం మర్రిపాడు మండలం నాగినేనిగుంట, బాట సింగనపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి ప్రతి గడపకు వెళ్లి జగన్న సంక్షేమానికి ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్న ఏకైక నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని, అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఉన్న ఊరిలోనే ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందేలా చేయడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదివేలా అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య పథకాలను అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్స్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలతో ప్రతి కుటుంబాన్ని ఆనందంలో ఉంచారన్నారు. మే13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని, ఎంపీగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి స్థానిక మహిళలు హారతులతో స్వాగతించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాధవరెడ్డి, నారపరెడ్డి సుబ్బారెడ్డి, కాంతారెడ్డి, చెవుల శ్రీనివాసులు, కాశీరెడ్డి, రసూల్ తదితరులు ఉన్నారు.

బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు

- చైర్మన్ యశ్వంత్ కుమార్



రైతులతో మాట్లాడుతున్న యశ్వంత కుమార్

మర్రిపాడు: 'వచ్చే పంట కాలానికి బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలి. అప్పుడే రైతులకు మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది' అని బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ తెలిపారు. మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శనివారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రంలో సుమారు 30 మిలియన్ కిలోల పొగాకు అమ్మడం జరిగిందన్నారు. వీటిలో 80 శాతం లోగ్రేడ్ ఉందన్నారు. రైతులు అన్ని రకాల పొగాకు తెచ్చుకుని అమ్ముకుంటే మంచి ధరలు వస్తాయని, లోగ్రేడ్ మాత్రమే తీసుకురావడం వల్ల అమ్మకాల్లో సమస్య వస్తుందన్నారు. పొగాకు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్నామని, అన్ని రకాలకు మంచి రేటు వచ్చేలా చేస్తామని తెలిపారు. పంటల సాగులో ఖర్చు వీలైనంత తగ్గించుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం కావాల్సిన అన్ని చర్యలను బోర్డు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వరికి బదులు ఆరుతడి పంటలు

సంగం: రెండో పంటకు సాగునీటి లభ్యత లేనందున వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగుపై దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు సీ మారుతిదేవి అన్నారు. శనివారం మండలంలోని అన్నారెడ్డిపాళెం, దువ్వూరు, పడమటిపాళెం, సంగం గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయాధికారులు బీ ఎస్.చక్రవర్తి, ఈ శైలజ, వీఏఏలు అనిల్‌కుమార్, సుమంత్ భరద్వాజ్, శ్రావణి, శిరీష పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైర్లలో మంటలు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి రైస్‌మిల్లు దగ్గర ఉన్న 100 కేవీహెచ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం మంటలు చెలరేగడంతో ఫ్యూజ్ బోర్డులు, వైర్లు కాలిపోయినట్లు విద్యుత్ శాఖ ఏఈ ఉడతా మన్మథరావు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే చెత్త వేయడంతో మంటలు వచ్చాయని ఆయన తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారన్నారు. ప్రస్తుతం మరమ్మతులు చేయాల్సి ఉండడంతో ఆ ప్రాంత ప్రజలకు విద్యుత్‌ను వేరే లైన్ ద్వారా ఇచ్చామన్నారు.

రెండు లారీలు ఢీ

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మర్రిపాడు: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నందవరం సమీపంలో నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఎస్సై విశ్వనాథరెడ్డి సమాచారం మేరకు కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గు లోడుతో కడపకు వెళ్తున్న లారీని కడప వైపు నుంచి నెల్లూరుకు చికెన్ వ్యర్థాలతో వెళ్తున్న లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ఎస్సై జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నోట్ల కట్టల్లో చిలక్కొట్టుడు

ఆత్మకూరురూరల్: టీడీపీకి పాడి ఆవుగా దొరికిన నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రలోభాల కోసం విచ్చలవిడిగా వెదజల్లుతున్న నోట్ల కట్టల్లో నోట్లు నొక్కేస్తున్నట్లు టీడీపీ వర్గాల్లో దుమారం రేగుతోంది. ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆత్మకూరు నియోజకవర్గంలో చిలక్కొట్టుడు వ్యవహారం వెలుగు చూడడంతో వేమిరెడ్డి శిబిరం తలలు పట్టుకుంటోందని ఆ పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి శనివారం నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మండలాల వారీగా పలు గ్రామాలకు చేరిన నోట్ల కట్టల్లో నోట్లు లాగేసి ఇస్తున్నట్లు విషయమై బాహాటంగా చర్చ జరిగింది. మండలాల స్థాయిలో ఆర్థిక పెత్తనం చేసే నాయకులు క్షేత్రస్థాయికి చేర్చాల్సిన నోట్ల కట్టల్లో 10 నోట్లు పక్కకు లాగి అందిస్తున్నారట. పంపకం సమయంలో కట్టలు చీల్చి లెక్క చూసుకుంటే ఒక్కో రూ.500 నోట్ల కట్టలో 100 కాగితాలకు బదులు 90కి అటూ, ఇటూగా ఉండడం చూసి బిత్తరపోతున్నారట. ఈ వ్యవహారంపై కలకలం రేగడంతో ఆ నోటా, ఈ నోటా వేమిరెడ్డి, ఆనం దృష్టికి కూడా వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే అసలే ఎన్నికల సీజన్ కావడంతో ఎవరిని ప్రశ్నించినా ఏ సమస్య నెత్తికొస్తుందోనని వారు కిక్కురుమనకుండా మిన్నకుండిపోయారని తెలుస్తోంది. దీనిని మరింత అలుసుగా తీసుకున్న మండల స్థాయి, కొందరు గ్రామ స్థాయి నాయకులు వేమిరెడ్డి నోట్ల కట్టలకు మరింత ఎక్కువగా తూట్లు పొడిచి సొంతం చేసుకొనేందుకు అత్యుత్సాహంతో పనిచేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో బలమైన చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

సొసైటీ కార్యాలయంలో డీసీఓ తనిఖీ



పెట్రోలు బంకును పరిశీలిస్తున్న డీసీఓ గుర్రప్ప

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి పీఏసీఎస్‌ను జిల్లా కోఆపరేటివ్ అధికారి గుర్రప్ప శనివారం తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించి రుణాల వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులకు సొసైటీ ద్వారా అందిస్తున్న పలు రకాల రుణాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం సొసైటీలన్నీ కంప్యూటరైజ్ చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సూచనలు చేశారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ పెట్రోలు బంకును తనిఖీ చేశారు. ఆయనతో పాటు సీఈఓ శ్రీనివాసులు, పెట్రోలు బంకు సిబ్బంది ఉన్నారు.

గొట్టిపాటితో మేకపాటి, విష్ణు భేటీ



శ్యాంసుందర్‌నాయుడిని కలిసిన రాజగోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

జలదంకి: ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం మాజీ ఎమ్మెల్యే దివంగత గొట్టిపాటి కొండపనాయుడు సోదరుడు గొట్టిపాటి శ్యాంసుందర్‌నాయుడుతో కావలిలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆయన్ను కోరారు. శ్యాంసుందర్‌నాయుడు మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డి గెలుపు కోసం తాను ఉదయగిరి నియోజకవర్గం మొత్తం పర్యటన చేస్తానన్నారు. వీరి వెంట పార్టీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడు తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న పరిశీలకుడు

ఉదయగిరి: ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శనివారం వ్యయ పరిశీలకుడు జ్యోతిమోయ్‌బైలాంగ్ ఆకస్మికంగా సందర్శించారు. ఆయన ఎన్నికల నిర్వహణ రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌తో చర్చించారు. ఎన్నికల వ్యయ వివరాల నమోదుపై సిబ్బందితో చర్చించి తగు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల వ్యయ వివరాలను సమగ్రంగా నమోదు చేస్తుండాలన్నారు. అనంతరం దుత్తలూరు సెంటరులో ఉన్న పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఏఆర్వో నెహ్రూబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాయిపేటలో విజయ సంకల్ప యాత్ర

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు గుడవల్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడి, మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై వర్క్‌షాప్

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020'పై శనివారం వన్ డే వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మందికిపైగా అధ్యాపకులు హాజరయ్యారు. కేఎల్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ కొణిజేటి రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో వచ్చిన మార్పులు, 2020కి ముందు ఉన్న బోధనా పద్ధతులు, అప్పటికీ, ఇప్పటికీ మధ్య వచ్చిన వ్యత్యాసాలు, సమస్యలు, ఆధునిక విద్యా విధానాలు, బోధనా రీతులు, తదితర అంశాలపై చర్చించారు. ప్రపంచీకరణకు అనుగుణంగా విద్యావిధానాల్లో వస్తున్న మార్పులు, అంతర్జాతీయ స్థాయిలో భారత విద్యావిధానానికి పెరుగుతున్న ఆదరణ, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆర్ఎస్సార్ కళాశాల డాక్టర్ పీవీఎన్ రెడ్డి, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ముజాహిద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లక్ష్మీ, ఏపీ ఆర్వీ రమణా రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.